క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం భక్తుల భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

వృద్ధాశ్రమంలో అన్నదానం



పొదలకూరు : మండల సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి సతీమణి గోగిరెడ్డి ప్రభావతమ్మ నాలుగో వర్ధంతి సందర్భంగా పట్టణంలోని నర్సారెడ్డికాలనీలో ఉన్న వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకురాలు రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మురళీకృష్ణకు పురస్కారం



పురస్కారంతో మురళీకృష్ణ

ముత్తుకూరు : ముత్తుకూరుకు చెందిన డాక్టర్ జీవీబీ మురళీకృష్ణకు 'జ్యోతిష్య భారతి' పురస్కారం లభించింది. తిరుపతిలోని సర్ సీవీ రామన్ అకాడమీ(సేవా సాంస్కృతిక సంస్థ) ఈ పురస్కారాన్ని శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ఆడిటోరియంలో ప్రదానం చేశారు. వాస్తవానికి ఫిబ్రవరి 4వ తేదీన ఈ పురస్కారం ప్రదానం చేయగా, అనారోగ్య కారణాల వల్ల ఆయన వెళ్లలేకపోయారు. గురువారం కొరియర్ ద్వారా పురస్కారంతో పాటు స్వర్ణకంకణం, మెమెంటోను బహూకరించినట్లు వెల్లడించారు. జ్యోతిష్య శాస్త్రంలో చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం ప్రదానం చేశారని తెలిపారు.

11న కళానీరాజనం

నెల్లూరు(బృందావనం): న్యూరాజ్యలక్ష్మి హాల్, శుభమస్తు షాపింగ్‌మాల్ వ్యవస్థాపకులు బీవీ రమణయ్య, సరోజనమ్మ స్మృత్యార్థం నగరంలోని పురమందిరంలో ఈ నెల 11న కళానీరాజనం నిర్వహిస్తున్నట్లు కేతా అంకులు మెమోరియల్‌ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. అందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను పురమందిరం ప్రాంగణంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేతలు బయ్యా శ్రీనివాసులు, వెంకటరవికుమార్ సహకారంతో కళానీరాజనం చేపడుతున్నామన్నారు. వర్ధమాన కళాకారుల ప్రతిభను వెలుగుతోకి తీసుకురావాలన్న సంకల్పంతో ఉదయం 10 నుంచి రాత్రి 10గంటల వరకు పాటలు, నృత్య పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వర్ధమాన కళాకారులు 77299 42543 నంబరులో సంప్రదించాలని కోరారు.

15,16న రథసప్తమి వేడుకలు

నెల్లూరు(బృందావనం): రథసప్తమిని పురస్కరించుకుని ఈ నెల 15,16 తేదీల్లో నగరంలోని సుజాతమ్మ కాలనీలోని అవధూత దత్తపీఠం నెల్లూరు శాఖకు చెందిన శ్రీకృష్ణయోగ, శ్రీఅష్టలక్ష్మి మందిరంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎస్కేజీబీఎస్ ట్రస్టు ఎగ్జిక్యూటీవ్ ట్రస్టీ సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. గురువారం శ్రీకృష్ణయోగ, శ్రీఅష్టలక్ష్మి మందిరం ప్రాంగణంలో రథసప్తమి ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైసూరు అవధూత దత్తపీఠ ఉత్తరాధీశ్వరులు దత్త విజయానంద తీర్థస్వామి దివ్య సమక్షంలో ఈ నెల 15న ఉదయం 10గంటలకు శ్రీసూక్త యాగం, శ్రీచక్రార్చన, సాయంత్రం 6.30 గంటలకు దివ్యనామ సంకీర్తనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రథ సప్తమిని పురస్కరించుకుని ఈ నెల 16న ఉదయం 6గంటలకు రథసప్తమి పూజ, ఆదిత్య హృదయపారాయణం, 10 గంటలకు శ్రీచక్రార్చన, మహాసౌర హోమం, సాయంత్రం 5గంటలకు సరస్వతిపూజ, 6గంటలకు దివ్యనామ సంకీర్తన, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. సరస్వతి పూజ అనంతరం విద్యార్థులకు పెన్నులు అందజేయనున్నట్లు తెలిపారు.

నిరుపేదల కల సాకారం

- ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు
- సర్వేపల్లిలో 10 వేల ఎకరాల పంపిణీ లక్ష్యం
- 90 శాతం భూ పట్టాల పంపిణీ పూర్తి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శాశ్వత భూహక్కు



ఇటీవల చెన్నారెడ్డిపల్లిలో భూ పట్టాలను అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : దశాబ్దాల బడుగు, బలహీన వర్గాల రైతుల నిరీక్షణ ఫలించింది. అనాదిగా వ్యవసాయ కూలీలుగా బతుకెళ్లదీస్తున్న బడుగు జీవులకు శాశ్వత భూహక్కును రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. గ్రామీణ ప్రాంతాల్లో భూపట్టాల పంపిణీ పండగ వాతావరణాన్ని తలపించింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతమంది నాయకులు వచ్చినా అమలు చేయలేని భూ సంస్కరణలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసింది. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి విసిగిపోయిన రైతుల ఇంటి వద్దకే పట్టాలు వచ్చాయి. ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టా కాగితాలు చూడలేమని భావించిన రైతుల కల సాకారమైంది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గంలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదలకు భూ పట్టాలను పంపిణీ చేశారు.

మంత్రి కాకాణి ప్రత్యేక చొరవ

సర్వేపల్లి నియోజకవర్గంలో అర్హులైన ప్రతిఒక్కరికీ భూ హక్కులు కల్పించేలా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మొదట సర్వేపల్లిలో 5 వేల ఎకరాలను అసైన్‌మెంట్, పీఓటీ పట్టాలను అందజేయాలని మంత్రి లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ప్రస్తుతం 10 వేల ఎకరాలకు భూ పంపిణీ కార్యక్రమం చేరుకుంది. అర్హులైన ప్రతిఒక్కరికీ శాశ్వత భూహక్కును కల్పించి చరిత్ర సృష్టించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షాలు విమర్శలు చేసినా లబ్ధిదారులు సంతృప్తిగా జగనన్న ప్రభుత్వాన్ని నెత్తిన పెట్టుకుంటున్నారు. పొదలకూరు, ముత్తుకూరు, వెంకటాచలం, మనుబోలు, టీపీగూడూరు మండలాల్లో ఇప్పటి వరకు 6,612 ఎకరాల భూమిని పేదలకు అందజేశారు. మరో వెయ్యి ఎకరాలకు సంబంధించిన భూపట్టాలు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా అర్హులైన వారిని గుర్తిస్తుండడం వల్ల మరో వెయ్యి ఎకరాలు కూడా అందజేసేందుకు మంత్రి కాకాణి ప్రయత్నిస్తున్నారు. ఈ మండలాల్లో చివరి జాబితా ప్రకారం మిగిలిన భూములను కూడా అందజేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

మండలం	రైతులు	ఎకరాలు
వెంకటాచలం	2014	2,193
మనుబోలు	859	1,028
ముత్తుకూరు	391	310
టీపీగూడూరు	115	171
పొదలకూరు	1,939	2,910



పేదలకు అందజేసిన భూ పట్టా

కలలో కూడా అనుకోలేదు



తాము సాగు చేసుకుంటున్న భూమికి పట్టా పొందుతామని కలలో కూడా అనుకోలేదు. జగనన్న ప్రభుత్వం పేదలను ఆదుకునేందుకే ఉంది. మంత్రి కాకాణి కృషి వల్ల మేము సాగు చేసుకుంటున్న భూమికి శాశ్వత హక్కు లభించింది. లేదంటే వ్యవసాయ కూలీలుగా మిగిలిపోవాల్సి వచ్చేది. – నేలటూరు మరియమ్మ, నావూరుపల్లి ఎస్సీకాలనీ, పొదలకూరు

సంతోషంగా ఉంది



శాశ్వత భూ హక్కు లభించినందుకు సంతోషంగా ఉంది. ఎంత మందిని భూ పట్టాలు అందజేయమని అడిగినా లాభం లేకుండాపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే మాలాంటి పేదలకు న్యాయం జరిగింది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ వల్ల మాకు భూ పట్టాలు అందాయి. – నిమ్మళ్ల మహాలక్ష్మమ్మ, పులికల్లు, పొదలకూరు

అర్హులకు భూ పట్టాలు

మిగిలిపోయిన అర్హులకు కూడా భూ పట్టాలను అందజేస్తాం. చివరి జాబితాను కూడా ఉన్నతస్థాయి అధికారులకు పంపాం. త్వరలో వారికి కూడా భూ పట్టాలను పంపిణీ చేస్తాం.
– కె.వీరవసంతరావు, తహసీల్దార్, పొదలకూరు

బయోమెట్రిక్ తప్పనిసరి



నార్తురాజుపాళెంలో పంట నమోదు రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు : పంట నమోదు పూర్తయిన రైతులు తప్పనిసరిగా బయోమెట్రిక్ కూడా పూర్తి చేసుకోవాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో గురువారం ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నమోదు రికార్డులను సూపర్‌చెక్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం పంట నమోదు మాత్రమే సరిపోదని, ప్రతిరైతు విధిగా బయోమెట్రిక్ వేయాలన్నారు. ఈనెల 15లోగా పంట నమోదుతో పాటు, బయోమెట్రిక్‌ను కూడా వంద శాతం పూర్తి చేయాల్సి ఉంటుందని సూచించారు. ఏఓ వెంట వీఏఏ శివజ్ఞాన, వలంటీర్ శ్రీకాంత్, రైతులు ఉన్నారు.

డీటీగా శివబాలకృష్ణయ్య బాధ్యతల స్వీకరణ

పొదలకూరు : డిప్యూటీ తహసీల్దార్‌గా శివబాలకృష్ణయ్య స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మనుబోలు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయన స్థానంలో డీటీగా కొనసాగుతున్న ఎస్ఎస్ సాయిగణేష్‌బాబు తిరిగి రీ–సర్వే డీటీగా బాధ్యతలు స్వీకరించారు.

పది పరీక్షలపై ఆందోళన వద్దు



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు కోదండరామయ్య

కోవూరు : విద్యార్థి జీవితంలో పదో తరగతి పరీక్షలు అత్యంత కీలకమని, పరీక్షలు రాసే సమయంలో ఆందోళన వద్దని వ్యక్తిత్వ వికాస నిపుణుడు కోదండరామయ్య అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పే అంశాలను పూర్తిగా ఆకళింపు చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. పరీక్షలపై బెరుకుతనం, ఆందోళనలు పక్కన పెట్టి ఇచ్చిన ప్రశ్నపత్రాలను ఒకటికి రెండు సార్లు చదువుకోవాలని సూచించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం కోదండరామయ్యను సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం నరసింహమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుచ్చిలో పొదుపు సమాఖ్య సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : స్థానిక నగర పంచాయతీ కౌన్సిల్ హాలులో ఆరో సర్వసభ్య సమాఖ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడారు. పొదుపు గ్రూపు సభ్యులు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. రుణం తీసుకున్న వారు సకాలంలో వాటిని చెల్లించాలని సూచించారు. పొదుపును ఆసరాగా చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. సమావేశంలో కమిషనర్ రమణబాబు, కౌన్సిలర్లు ప్రమీల, వెంకటేశ్వర్లు, పొదుపు సీఈఓ నర్మద తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



ఎంపీపీ కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే ప్రసన్న

విడవలూరు: ఎంపీపీ వేణుంబాక భవానమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, ఆమె కుటుంబాన్ని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. విడవలూరులోని మన్మధరావుపేటలో ఉన్న ఆమె నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులతో మాట్లాడారు. భవానమ్మ మృతి పార్టీకి తీరని లోటు అని, కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత పాశం శ్రీహరిరెడ్డి తదితరులు ఉన్నారు.

లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్




గుండాలమ్మపాళెంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్

కొడవలూరు: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకానికి సంబంధించి లబ్ధిదారుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రిజిస్ట్రేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్ సూచించారు. మండలంలోని గుండాలమ్మపాళెం సచివాలయంలో జరుగుతున్న గృహ లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే నివేశన స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయడం గతంలో ఎప్పుడూ లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సొంతింటిపై సకల హక్కులు కల్పిస్తూ ఈ బృహత్తర అవకాశాన్ని కల్పించిందని తెలిపారు. దీనికి లబ్ధిదారులు పైసా ఖర్చులేకుండా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. దీనిని ప్రతి లబ్ధిదారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సచివాలయాల్లోనూ రోజువారీ రిజిస్ట్రేషన్‌ల సంఖ్య గణనీయంగా పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి అంకమరాణి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పొదుపు సభ్యులతో తాగునీటి కనెక్షన్లు

- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్

కొడవలూరు: జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ కుళాయి సౌకర్యం కల్పించే బాధ్యతను పొదుపు సభ్యులు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.రమేష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పొదుపు సభ్యులు, ఇంజినీరింగ్ సహాయకులకు 'కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ సిస్టమ్' పై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ నూతన విధానంలో ఎంపికైన పొదుపు సభ్యులు ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చే బాధ్యత తీసుకుంటారన్నారు. అందుకయ్యే వ్యయాన్ని పూర్తిగా ప్రభుత్వం భరిస్తుందన్నారు. పొదుపు సభ్యులతో పాటు ఇంజినీరింగ్ సహాయకుల పర్యవేక్షణలో పనులు చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్, ఈఓపీఆర్డీ వి.డేవిడ్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.రుక్మిణి పాల్గొన్నారు.

జేసీని కలిసిన ఎమ్మెల్యే ప్రసన్న



జేసీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు : జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌ను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నెల్లూరులోని ఆయన కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, కోవూరు ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత బాలశంకర్‌రెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్

కొడవలూరు: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన పి.శైలేంద్రకుమార్ స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావులను నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను ఇచ్చారు. ఆయన వెంట డీటీ గున్నం మల్లికార్జున ఉన్నారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలపొచ్చు

కోవూరు : నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చని కోవూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.శ్రీనివాసులు అన్నారు. కోవూరు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో గురువారం ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారు ఉంటే ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. కుటుంబ సభ్యులందరినీ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో వచ్చేలా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ జాబితాను రాజకీయ పార్టీలు పరిశీలించి ఇంకా ఏమైనా తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తహసీల్దార్ విజయశ్రీ, మండల ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధు పాల్గొన్నారు.

అక్కపై దాడి.. ఇంటికి నిప్పు

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక విభేదాల నేపథ్యంలో అక్కపై తమ్ముడు దాడి చేయడమే కాకుండా ఆమె ఇంటికి నిప్పు అంటించాడు. ఈ ఘటన ఫత్తేఖాన్‌పేటలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఫత్తేఖాన్‌పేటకు చెందిన సురేఖ, కిశోర్ అక్కాతమ్ముడు. వీరు ఒకే ప్రాంతంలో వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. వీరి మధ్య ఆర్థిక విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కిశోర్ తన అక్కపై దాడి చేయడమే కాకుండా ఆమె ఇంటికి నిప్పంటించాడు. ఈ మేరకు బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: దోమల మందు పిచికారీ యంత్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

- చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలో దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. బుచ్చి పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో దోమల నివారణ మందు పిచికారీ యంత్రాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఇళ్లలో దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వారంలో ఒకరోజు డ్రైడే పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు కూడా దోమల నియంత్రణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి వార్డులో ఆయా సచివాలయాల సిబ్బందితో కలిసి దోమల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు, నాయకులు ఆనంద బాలసుబ్రహ్మణ్యం, ప్రసాద్, శ్రీధర్, సునీల్, శీనయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

మనుబోలు : మండలంలోని మడమనూరు గ్రామంలో దోమల బెడదను నివారించేందుకు ఫాగింగ్ చేయిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రేష్మసోని తెలిపారు. బుధవారం రాత్రి పంచాయతీ సిబ్బంది మలాథియాన్ ద్రావణాన్ని ఫాగింగ్ యంత్రం ద్వారా గ్రామంలోని వీధుల్లో పిచికారీ చేశారు. మురుగు కాలువల్లో నిల్వ చేరకుండా ఎప్పటికప్పుడు పూడిక తీయిస్తూ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే వారానికోసారి డ్రైడే పాటిస్తూ ఇళ్లలో తాగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ స్వప్నీల్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జొన్నవాడ సెంటర్‌లో వాహనదారులకు రోడ్డు భద్రతపై గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంవీఐ స్వప్నీల్‌రెడ్డి మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. ప్రమాదాల సమయంలో క్షతగాత్రులకు వైద్యసాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. సాయం అందించిన వారికి పారితోషకంతో పాటు ప్రశంసా పత్రం కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రఘువర్ధన్‌రెడ్డి, డాక్టర్ స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంపై దృష్టి సారించాలి



వ్యాయామం చేస్తున్న విద్యార్థినులు

కోవూరు : ప్రాథమిక దశ నుంచి ప్రతి విద్యార్థి వ్యాయామంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఫిజికల్ డైరెక్టర్ దేవిక సూచించారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో విద్యార్థులకు వ్యాయామంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాయామం వల్ల శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండవచ్చని తెలిపారు. విద్యార్థుల్లో బెరుకుతనం పోయి చురుకుతనం వస్తుందన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి వారికి నచ్చిన క్రీడలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పీఈటీ వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

నేడు శ్రీవారి కల్యాణోత్సవం

నెల్లూరు(బృందావనం): శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని లోక కల్యాణార్థం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని పద్మావతినగర్‌లోని శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరం వద్ద శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆ కార్యక్రమ నిర్వాహకుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన శ్రీవారి కల్యాణ మహోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో 13వ పర్యాయం శ్రీవారి కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా ఉదయం బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం సీతారామస్వామి మందిరం నుంచి దేవదేవేరుల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకెళ్లి కొలువుదీర్చి సాయంత్రం 5.30 గంటలకు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు కల్యాణ ముత్యాల తలంబ్రాలు, కంకణాలు, తిరుమల లడ్డూ ప్రసాదాలను వితరణ చేయనున్నట్లు చెప్పారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కల్యాణోత్సవానికి రానున్నారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.